క్లుప్తంగా

రేషన్ కార్డుల జారీకి సర్వే



పెద్దాపూర్‌లో సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కొత్త రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపడుతున్నట్లు ఎంపీడీఓ ఉమాదేవి పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని పెద్దాపూర్, వెల్దుర్తి పంచాయతీ పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కుల గణన సర్వే ఆధారంగా రేషన్ కార్డు జాబితాలో వచ్చిన వివరాలను క్షేత్రస్థాయిలో విచారించి అర్హులను ఎంపిక చేయడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ విఘ్నేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులకే పథకాలందాలి

తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

శివ్వంపేట(నర్సాపూర్): అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందించడంతో సిబ్బంది పాత్ర కీలకమని తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అసలైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల ఎంపికలో సమగ్రంగా వివరాలు సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏఓ లావణ్య, తదితరులు ఉన్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా మెదక్

జిల్లా సంక్షేమ అధికారి హైమావతి



వడియారంలో సాగు భూమి వివరాలు సేకరిస్తున్న హైమావతి

చేగుంట (తూప్రాన్): మండలంలోని వడియారం, నక్కరాజుపేట, చిన్న శివనూర్, బోనాల గ్రామాల్లో సాగుకు యోగ్యంగా లేని భూముల వివరాలను జిల్లా సంక్షేమ అధికారి హైమావతి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెదక్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలంపాట

జహీరాబాద్ టౌన్: అల్గోల్ రోడ్డులో గల ప్రసిద్ధి చెందిన సిద్ధేశ్వర దేవస్థానంలో 2025-26 సంవత్సరానికి కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయాలకు సంబంధించి శుక్రవారం వేలం పాట నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని ఆలయ ఈఓ శివ రుద్రప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ. 25 వేలు డిపాజిట్ చేయాలన్నారు.

నేటి నుంచి జయంత్యుత్సవాలు

సిద్ధివినాయక ఆలయంలో ఏర్పాట్లు



సిద్ధివినాయక ఆలయం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ శివారులో వెలిసిన సిద్ధివినాయక ఆలయంలో శుక్రవారం నుంచి జయంత్యుత్సవాలు జరగనున్నాయి. ఇందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం స్వామి వారికి వేదఘోష, దీప ప్రజ్వలన, ధ్వజారోహణం, స్వస్తిపుణ్యాహవచనం, అభిషేకం, దేవతా ఆహ్వానం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్సవాలకు ఆలయ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు కూడా పెద్ద ఎత్తున తరలి వస్తారు.



గోవును దానం చేసిన ఎమ్మెల్యే

ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి గురువారం తన స్వగ్రామమైన గోమారంలో గంగిరెద్దుల వారికి ఆవును దానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్త దేవతలందరు గోవులో ఉంటారని, గోమాతను పూజించడం వల్ల సకల దేవతలను పూజించినట్లేనని పేర్కొన్నారు. గోవులను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, లక్ష్మణ్, రాకేష్‌రెడ్డి ఉన్నారు.

- శివ్వంపేట(నర్సాపూర్):

చండీలో ఉచిత వైద్యం శిబిరం



మండల పరిధి చండీలో గురువారం గోపాలమిత్ర ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు పశు వైద్యాధికారి సంధ్యారాణి వైద్య పరీక్షలు నిర్వహించారు. మూగ జీవాల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని, పశువులు అనారోగ్యానికి గురైతే నాటువైద్యం చేయకుండా తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్ వైజర్ సత్యనారాయణ, గోపాలమిత్రలు గణేష్, గోపాల్, తదితరులు ఉన్నారు.

- శివ్వంపేట(నర్సాపూర్):

వేతనాలు అందక వెతలు

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

రామాయంపేట(మెదక్): తమ సమస్యల పరిష్కారం కోసం పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర కార్మికులు గురువారం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వకుండా అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత నెలకు సంబంధించి వేతనాలు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. అర్ధాకలితో విధులు నిర్వహిస్తున్న కార్మికుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పారు. యూనిఫాంలు, సబ్బులు, మాస్కులు గ్లౌజులు సైతం ఇవ్వలేదని ఆరోపించారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే కార్మికులు పనులు మానివేసి ఉద్యమం తీవ్రతరం చేస్తారని బాలమణి హెచ్చరించారు.

ఈజీఎస్ సిబ్బంది నిరసన

శివ్వంపేట(నర్సాపూర్): వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈజీఎస్ సిబ్బంది వాపోయారు. మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడం పట్ల గురువారం ఈజీఎస్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఏపీఓ అనిల్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు దామోదర్, ప్రధాన కార్యదర్శి సంజీవచారి, ఈసీ సురేందర్ మాట్లాడుతూ నిత్యం విధుల్లో భాగస్వాములు అవుతున్న తమకు నెలవారీగా వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని,



శివ్వంపేట: నిరసన తెలుపుతున్న ఈజీఎస్ సిబ్బంది

ప్రభుత్వం స్పందించి తమ వేతనాలు విడుదల చేయాలని కోరారు.

పకడ్బందీగా రైతు భరోసా సర్వే



వివరాలు సేకరిస్తున్న ఆర్ఐ నర్సింగ్‌యాదవ్

వెల్దుర్తి(తూప్రాన్): రైతు భరోసా పథకంలో అనర్హులను గుర్తించడానికి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించారు. ఈ నెల 26న సాగు భూములకే రైతు భరోసా కింద పెట్టుబడి డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయనున్న నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే గురువారం మండలంలోని ఉప్పులింగాపూర్, ధర్మారం, మంగళపర్తి, బండపోసాన్‌పల్లి, హస్తాల్‌పూర్ గ్రామాల్లో ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆర్ఐ తెలిపారు.

వ్యవసాయేతర భూముల గుర్తింపు

శివ్వంపేట(నర్సాపూర్): రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసాకు సంబంధించి అర్హులైన రైతుల గుర్తింపు కోసం సిబ్బంది గ్రామాల్లో వివరాలు సేకరిస్తున్నారు. మండల వ్యాప్తంగా నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. వ్యవసాయేతర, సాగుకు ఆమోదయోగ్యంగా లేని భూములను గుర్తించి వివరాలు నమోదు చేస్తున్నారు. రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి సమగ్ర వివరాలు సేకరిస్తున్నారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని లింగంపల్లి, కన్నారం, ముట్రాజ్‌పల్లి గ్రామాలలో అధికారులు రైతుభరోసా సర్వేను ప్రారంభించారు. గురువారం తహసీల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ జహీర్, సర్వేయర్ మొగులయ్య, ఆర్ఐ లక్ష్మణ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీహరి, ఏఈఓలు సర్వే చేశారు. గ్రామకంఠం పరిధిలోనికి వచ్చిన పంట పొలాలతో పాటు సాగు భూములలో గృహాలు నిర్మించిన భూములకు ప్రభుత్వం రైతుభరోసా చెల్లించదని, దీనికోసం సర్వేను చేస్తున్నట్లు చెప్పారు. దీంతోపాటు ప్లాట్లుగా మారిన వెంచర్లు, పంటల సాగుకు యోగ్యంగాలేని భూములకు రైతు భరోసా ఇవ్వరని తహసీల్దార్ స్పష్టం చేశారు.

సాగుభూమికే రైతు భరోసా

టేక్మాల్(మెదక్): సాగుకు పనికిరాని భూములకు రైతు భరోసా వర్తించదని తహశీల్దార్ తులసీరామ్ తెలిపారు. గురువారం టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి, ఎక్లాస్‌పూర్, తంప్లూర్, షాబాద్‌తండా, ,మల్కాపూర్ గ్రామాల్లో భూ వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా పథకానికి సాగు భూమి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాం ప్రసాద్, ఆర్ఐ సాయిశ్రీకాంత్, ఏఈఓలు లక్ష్మీ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

రైతు భరోసాపై సర్వే

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని కాయిదంపల్లి, వెంకట్‌రావ్‌పేట గ్రామాలలో గురువారం ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా పథకంపై వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. సాగు భూముల వివరాలు సేకరిస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఏఓ రాజేశ్, ఆర్ఐ సందీప్, సర్వేయర్ రాజు, ఏఈఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

రేగోడ్(మెదక్): మండలంలోని పోచారం, మర్పల్లి, వెంకటాపూర్, ఆర్.ఇటిక్యాల, గజ్వాడ గ్రామాల్లో గురువారం రైతు భరోసాకు అర్హులైన రైతులను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు భూములను పరిశీలించారు. నాలుగు బృందాలుగా ఏర్పడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ జావిద్ మాట్లాడుతూ.. ఈనెల 20 వరకు భూములను పరిశీలించి ఆ తర్వాత గ్రామ సభలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, ఆర్ఐలు ఫెరోజ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ లక్షల డప్పుల సభను విజయవంతం చేయాలి

టేక్మాల్(మెదక్): ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగబోయే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నిర్వహిస్తున్న లక్షల బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. గురువారం మండలంలోని కాద్లూర్‌లో మాదిగ సంఘ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. సభకు మాదిగలు పెద్ద ఎత్తున సభకు హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు మాసన్నగారి నాగరాజు, చింత రవి, ఎల్లయ్య, లక్ష్మణ్ ప్రసాద్, కున్నదొడ్డి శ్రీను, సాయిలు, బాల్‌రాజ్, సాయిలు, రమేష్, మొగులయ్య, శివకుమార్, సంజీవులు, నీలగిరి రాజు, పోచయ్య, శ్రీశైలం, భూమయ్య తదితరులు ఉన్నారు.

◆ పథకాల అమలుపై అవగాహన

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకరంగా నిర్వహిస్తున్న సంక్షేమ పథకాల అమలు విషయమై ఆయా గ్రామాల కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందికి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఈ సదస్సులో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తహశీల్దార్ రజనీకుమారి, ఎంపీడీవో సజీలుద్దీన్, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ అవగాహన కల్పించారు. అనుమానాలను నివృత్తి చేశారు.

◆ పీఆర్‌టీయూ డైరీ అందజేత



నర్సాపూర్: పీఆర్‌టీయూ డైరీని గురువారం పలువురు అధికారులకు ఆ యూనియన్ ప్రతినిధులు అందచేశారు. ఆర్‌డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మధులతలకు డైరీ, క్యాలండర్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్, మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మినారాయణ అందచేశారు.

◆ నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య గురువారం తెలిపారు. మరిన్ని మెరుగైన సేవలను అందించటంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు తమ సూచనలు, సమస్యలను 99592 23170 నంబరుకు ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉప్పర సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్: సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను ఉప్పర సంఘం నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఉప్పర సంఘం అధ్యక్షుడు మురళీ కృష్ణ మాట్లాడుతూ.. ఉప్పర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కేలండర్‌ను 20న ఆవిష్కరించేందుకు హాజరు కావాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రవి, మధుసూదన్ రెడ్డి, మల్లేశం, ప్రవీణ్, శ్రీనివాస్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని సింగూరులో నందికంటి శేఖర్ జ్ఞాపకార్థం క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో యువకులతోపాటు రైతులు పాల్గొన్నారు. గురువారం పుల్‌కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భగా ఎస్ఐ మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం ఏర్పడుతుందన్నారు. క్రీడా నిర్వాహకులు నందికంటి శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

శివదీక్ష మాలధారణ

సదాశివపేట(సంగారెడ్డి): శివనామస్మరణలతో పట్టణ పరిధిలోని శివాలయాలు గురువారం మార్మోగాయి. పట్టణంలోని సంగమేశ్వర, ఎడ్ల బజార్ బసవేశ్వర, శంభులింగేశ్వర, ఈశ్వర మార్కండేయ మందిరాల్లో అధిక సంఖ్యలో శివదీక్ష మాలధారణ చేశారు. నేటి నుంచి శివరాత్రి వరకు శివనామస్మరణతో నిత్యం ఉదయం సాయంత్రం పూజలు చేసి శివదీక్ష చేపట్టి పూర్తి చేస్తారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

గజ్వేల్‌రూరల్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వివిధ మండలాలకు నూతనంగా నియామకమైన అధ్యక్షులు హైదరాబాద్‌లో గురువారం ఆయనను కలిశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ అధ్యక్షు డు మనోహర్ యాదవ్, మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, కుకునూర్‌పల్లి అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, కొండపాక అధ్యక్షుడు సత్యం, తూప్రాన్ అధ్యక్షుడు జానకిరామ్, మనోహరాబాద్ మండలశాఖ అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.



నాయకులను సన్మానిస్తున్న ఎంపీ

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

విజేత జట్టుకు ట్రోఫీ, రూ.20వేలు నగదు అందజేత



ట్రోఫీతో విజేత జట్టు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రగంపేటలో సంక్రాంతి సందర్భంగా రంగంపేట గ్రామ స్థాయి ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ పోటీలు సీనియర్, జూనియర్ విభాగంలో ఐదు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. గురువారం బండి వెంకటరాజు, ఉసికె రాజు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ కొనసాగగా.. వెంకటరాజు టీం విజేతగా నిలిచింది. విజేతలకు గ్రామానికి చెందిన మద్దెల దశరథం కుటుంబ సభ్యుల ట్రోఫీలు, పీసీసీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి విజేత జట్టుకు రూ.20వేల నగదు, రన్నరప్ జట్టుకు రూ.10వేల నగదును ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కృష్ణ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసాద్, గ్రామ మాజీ సర్పంచ్ సుజాత, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్, దుర్గేష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



చిట్కుల్‌లో విజేత జట్టుతో మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి తదితరులు



మహమ్మద్‌నగర్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న గోవర్ధన్‌రెడ్డి

చిలప్‌చెద్(నర్సాపూర్): యువత క్రీడలలో రాణించాలని చిట్కుల్ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో నిర్వహించిన సీపీఎల్-2 సీజన్ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహద పడుతాయని పేర్కొన్నారు. యువత మొబైల్, ఇంటర్నెట్ మాయలో పడకుండా, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్‌లో..

కౌడిపల్లి(నర్సాపూర్): క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మహమ్మద్‌నగర్‌లో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో విన్నర్ గోపాల్‌గౌడ్ టీం, రన్నర్ రాజశేఖర్‌గౌడ్ టీంకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, నవీన్‌గుప్తా, బషీర్, రమేష్‌గౌడ్, యాదుల్, రవి, వెంకన్న, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ పథకాల సర్వేను పక్కాగా నిర్వహించాలని నార్సింగి ఎంపీడీఓ ఆనంద్ కోరారు. గురువారం నార్సింగి రైతు వేదికలో ఇందిరమ్మ సర్వేపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు న్యాయం జరిగేలా సర్వేను నిర్వహించాలని కోరారు. వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరీం, ఉప తహసీల్దార్ అనుషారెడ్డి, ఏఓ యాదగిరి పాల్గొన్నారు.

21 నుంచి గ్రామ సభలు

పెద్దశంకరంపేట(మెదక్): ఈ నెల 21 నుంచి గ్రామ సభలు నిర్వహించాలని, ఈ సందర్భంగా లబ్ధిదారుల వివరాల ఎంపిక పూర్తి చేయాలని ఎంపీడీఓ రఫీఖున్నీసా ఆదేశించారు. గురువారం గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలపై గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ విఠల్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, పోలీస్ సిబ్బంది



ఆటోను తనిఖీ చేస్తున్న పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రాష్ట్ర సరిహద్దులో గల కర్నాటక రాష్ట్రం బీదర్ పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు రాష్ట్ర సరిహద్దు వద్ద పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. రూరల్ సీఐ జెక్కుల హన్మంత్ ఆధ్వర్యంలో హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ సిబ్బందితో కలిసి కర్నాటక నుంచి రాష్ట్రంలోకి వస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

బర్దీపూర్ శివారులోనూ...

ఝరాసంగం(జహీరాబాద్): బీదర్ పట్టణంలో జరిగిన ఘటన నేపథ్యంలో గురువారం మండల పరిధిలోని బర్దీపూర్ శివారులోనూ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు శివకుమార్, శ్రావణి, సత్యనారాయణ, వెంకట్ రామ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు 'సీఆర్‌పీ' కౌన్సెలింగ్



మాట్లాడుతున్న యాదగిరి

వర్గల్(గజ్వేల్): సంచారజీవనమైనా సరే బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల క్లస్టర్ రీసోర్స్ పర్సన్ యాదగిరి అన్నారు. పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారం క్రితం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర ప్రాంతానికి చెందిన పలువురు సంచారజీవులు ప్లాస్టిక్ సామగ్రి విక్రయించుకునేందుకు వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లికి వచ్చారు. వారితోపాటు మధ్యలో బడిమానేసిన ముగ్గురు బడీడు పిల్లలున్నారు. ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ సర్వే కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన వారిని గుర్తించారు. జీవనం కోసం ఎక్కడికి వెళ్లినా పిల్లలను అక్కడి స్కూల్స్‌లో చేర్పించాలని సూచించారు.